సాక్షి కాకినాడ

శనివారం । 26 । జూలై । 2025



శిశువులకు అమృతమే..

శిశువుకు అత్యంత బలం, రోగనిరోధక శక్తిని అందించేవి తల్లిపాలే. అవి దాదాపు అమృతంతో సమానం. అందుకే పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించాలని వైద్యులు చెబుతారు.


8లో



పరామర్శకు వెళుతూ మృత్యుఒడికి..

ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరొకరు చికిత్స పొందుతున్నారు. పటవల జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 2,46,374 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద శుక్రవారం సాయంత్రం 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. గోదావరి డెల్టా కాలువలకు 8,500 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఆయకట్టుకు నేడు పంపా నీరు

- తొలుత 40 క్యూసెక్కుల విడుదల
- 93.5 అడుగులకు చేరిన నీటిమట్టం
- అవసరాన్ని బట్టి మరిన్ని జలాలు
- ఈఈ శేషగిరిరావు



అన్నవరంలోని పంపా రిజర్వాయర్

అన్నవరం: పంపా రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు శని వారం సాగునీరు విడుదల చేస్తున్నట్లు పెద్దాపురం డివిజన్ ఇరిగేషన్ ఈఈ జి.శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు రైతు నాయకులు నదికి పూజలు చేసి సారె సమర్పించిన అనంతరం నీటిని విడుదల చేయనున్నట్టు ఈఈ తెలిపారు. ప్రస్తుతం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని రైతుల అవసరాల మేరకు మరింత వదులుతామని ఆయన తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఈ ఏడాది పూర్తి స్థాయిలో పంపా ఆయకట్టులో 12,500 ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. చివరి ఆయకట్టుకు కూడా నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నీటిమట్టం 93.5 అడుగులు

పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు కాగా, శుక్రవారం సాయంత్రానికి 93.5 అడుగులకు చేరుకుంది. గరిష్ట నిల్వ 0.43 టీఎంసీలు కాగా ప్రస్తుతం 150 ఎంసీఎఫ్‌టీ నిల్వ ఉంది. రెండ్రోజులుగా పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తున్నందున రిజర్వాయర్ లోకి 105 క్యూసెక్కుల నీరు వస్తోందని, నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని ఈఈ తెలిపారు.

ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్‌లకు పరీక్ష రేపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కొంతమూరులోని ఈస్టర్ ఎక్సెన్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ ఎలిమెంటరీ, హైస్కూల్‌లో ఖాళీగా ఉన్న ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ పోస్టులకు ఆదివారం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు ఈ పరీక్షకు హాజరుకావాలన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. కాకినాడలోని అయాన్ డిజిటల్ జోన్, అచ్యుతాపురంలో 486 మందికి మొదటి సెషన్‌లో స్కూలు అసిస్టెంట్, 500 మందికి రెండో సెషన్‌లో ఎస్‌జీటీ వారికి పరీక్షలు జరుగుతాయన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, లూథర్‌గిరిలోని అయాన్ డిజిటల్ జోన్‌లో 263 మందికి రెండో సెషన్‌లో ఎస్‌జీటీలకు పరీక్షలు జరుగుతాయన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు పటిష్ట భద్రత

బోట్‌క్లబ్: ఈవీఎం, వీవీప్యాట్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు)లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాములను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసిస్టెంట్ సీఈఓ, రాష్ట్ర ఈవీఎంల నోడల్ అధికారి పి .తాతబ్బాయి, రెవెన్యూ, ఎన్నికలు, పోలీస్‌శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పీ–ఫోర్.. శ్రీమంతులు పరార్

- పల్టీ కొడుతున్న పీ–4 పథకం
- సంపద సృష్టి అని సంపన్నుల వెంట పరుగులు
- బంగారు కుటుంబాల కోసం ముందుకు రాని మార్గదర్శులు
- అధికారులకు గుదిబండగా సంపన్నుల అన్వేషణ
- బంగారు కుటుంబాల్లో కోత

పూర్వ కాలంలో రాబిన్‌హుడ్ సినిమాలు విపరీతమైన ప్రజాదరణ పొందేవి. కారణం వారు ధనవంతులను దోచి పేదలకు పంపకాలు చేసేవారు. దాంతో వారు ఆ పేదలకు ఆరాధ్యులయ్యేవారు. బందిపోటు భీమన్న చిత్రంలో ఎస్వీ రంగారావు.. కొదమసింహంలో చిరంజీవి ఇలా ఎన్నో చిత్రాలు ఆ కథాంశంతో సాగి విజయవంతమైనవే. కానీ అవి కేవలం రెండున్నర గంటల చిత్రాలు. వాటిని అలాగే చూడాలి. వాస్తవానికి వస్తే ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్టు ఎంత సంపాదించినా దానికి తగ్గ ఖర్చులు ప్రతి ఇంటా ఉంటాయి. ఎంతమంది వచ్చినా విస్తరి వేసే రోజులు పోయాయి. అలాంటి వారి వారసులు నేడు చాలా వరకు మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండన్న స్థితిలో గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమైపోయారు. ఈ నేపథ్యంలో పీ–4 పథకం కింద కొందరికి ఉన్నవారని ముద్ర వేసి బలవంతపు బాధ్యతలు అప్పగించాలని చూస్తోంది కూటమి సర్కార్. బాబ్బాబు కొన్ని పేద కుటుంబాలను ఆదుకోండని వారిని బతిమాలుతోంది. లేదంటే ఏదో ఒక రూపంలో వారిని వంచైనా బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేస్తోంది. కొందరేమో అబ్బే మావల్ల కాదని, మరికొందరు మాకు తోచిన సేవ మేం చేస్తున్నామని సున్నితంగా ఆ ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నారు. అయినా ఈ బలవంతపు అప్పగింతలేమిటని కొందరు సర్కార్‌ను ప్రశ్నిస్తున్నారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? మరి ఎన్ని కుటుంబాలను సర్కారు బంగారుమయం చేస్తుందో చూడాల్సిందే.



పెద్దాపురం మండలం వడ్లమూరులో తాను దత్తత తీసుకున్న చార్లెస్ కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంపద సృష్టిస్తామని గద్దెనెక్కిన చంద్రబాబు సంపన్నుల వెంట పడుతున్నారు. జీరో పేదరికమే లక్ష్యంగా బంగారు కుటుంబాలకు ఉజ్వల భవిష్యత్ కల్పిస్తామని కూటమి సర్కార్ గొప్పగా ప్రకటించింది. ఇందుకోసం విజయవాడలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జిల్లాల నుంచి బంగారు కుటుంబాల పేరుతో పెద్ద ఎత్తున జనాన్ని బస్సుల్లో తరలించి హడావిడి చేసింది. అలా అని ఆ బాధ్యతను ప్రభుత్వం మీద వేసుకోవడం లేదు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను ఉన్నత స్థితికి తీసుకువచ్చే బాధ్యతను సంపన్నులకు అప్పగించే ఏర్పాట్లు చేస్తోంది. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే వారికి మార్గదర్శులనే నామకరణం చేసింది. వాస్తవానికి సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అటువంటి ప్రభుత్వమే సమాజంలో సంపన్నులను గుర్తించి వారికి నిరుపేదలను దత్తత ఇవ్వడమంటే ప్రభుత్వం పేదల సంక్షేమం నుంచి వైదొలగి ఎన్‌జీఓలకు అప్పగించడమేనని విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

మార్గదర్శుల కోసం అన్వేషణ

పేదలను ఉన్నత స్థాయికి తీసుకువస్తామని ప్రచారం చేసుకుంటున్న కూటమి సర్కార్ (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్టనర్‌షిప్) పీ–4 అమలుకు కిందామీద పడుతోంది. ఉగాది సందర్భంగా ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. పీ–4 ప్రారంభంలో పెద్ద ఎత్తున బంగారు కుటుంబాల ఎంపిక చేశారు. తీరా చూస్తే ఆ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు ముందుకు రావడం లేదు. ఆగస్టు 15 నాటికి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేశారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి అధికారులలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. అంతటితో ఆగకుండా సంపన్నుల్లో స్ఫూర్తి నింపేందుకు జిల్లా కలెక్టర్లు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అయినా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మార్గదర్శుల కోసం అన్వేషణ తప్పడం లేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితితో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పీ–4 'ఆదిలోనే హంసపాదు' అన్న సామెత చందంగా తయారై ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వంపై విశ్వాసం లేకనో మరేమిటో కారణం తెలియదు కానీ చంద్రబాబు చెబుతున్నట్టుగా ఆశించిన స్థాయిలో సంపన్నులు (మార్గదర్శులు) ముందుకు రావడం లేదు.

తుది జాబితాల కోసం సర్వేలు

ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అధికార యంత్రాంగం అంతా సంపన్నుల అన్వేషణలో తలమునకలై ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఆగస్టు–15 దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో మిగిలిన పనులన్నింటినీ పక్కనబెట్టి అధికారులు సంపన్నుల అన్వేషణలో పడ్డారు. మార్గదర్శకులు ముందుకు రాకపోవడంతో పీ–4 ప్రారంభంలో పెద్ద సంఖ్యలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాల సంఖ్య తగ్గించే పనిలో పడ్డారు. బంగారు కుటుంబాల తుది జాబితా కోసం సచివాలయ ఉద్యోగుల దగ్గర నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు సర్వేలలో తలమునకలై ఉన్నారు. ఉదాహరణకు కాకినాడ జిల్లా యంత్రాంగం పారిశ్రామిక సంస్థలు, విభిన్న సంపన్న వర్గాలను మార్గదర్శులుగా అభ్యర్థిస్తూ 80 లేఖలు రాశారని సమాచారం. మిగిలిన రెండు జిల్లాల్లోను కొద్ది అటు, ఇటుగా దాదాపు ఇదే వాతావరణం కనిపిస్తోంది. ఈ సరికే చారిటీలతో పేదలకు సేవలందిస్తున్నామని కొందరు, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ ఫండ్‌తో సేవలు చేస్తున్నామని మరి కొందరు, నిరుపేదలను ఆదుకుంటున్నామని ఇంకొందరు ఆసక్తి చూపకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కుదించే పనిలో అధికారులు

పేదల్లో నిరుపేదల ఎంపిక పేరుతో బంగారు కుటుంబాల సంఖ్య కుదించే పనిలో పడ్డారు. బంగారు కుటుంబాల తగ్గింపు, మార్గదర్శుల గుర్తింపు ప్రక్రియ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు గుదిబండగా మారింది. మండల స్థాయిలో ఒక్కో అధికారి నలుగురికి తక్కువ కాకుండా మార్గదర్శులను గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి అధికారులపై ఒత్తిళ్లు ఉన్నాయి. ఈ మేరకు మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. పారిశ్రామిక సంస్థలు, ప్రవాస భారతీయులు, వైద్యులు, విభిన్న రంగాలకు చెందిన సంపన్నులను గుర్తించి పీ–4 అములులో మార్గదర్శులుగా వారిని భాగస్వాముల్ని చేయాల్సిన బాధ్యతను అప్పగించడం అధికారులకు గుదిబండగా మారింది. మొదట్లో ఎడాపెడా కుటుంబాలను ఎంపిక చేయించిన ప్రభుత్వం ఇప్పుడు మార్గదర్శకాల పేరుతో కుటుంబాల సంఖ్యను తగ్గించే పని అప్పగించింది. సొంతిల్లు, విద్యుత్ కనెక్షన్, కుళాయి కనెక్షన్.. ఇవేవీ లేని అత్యంత నిరుపేదలను ఎంపిక చేయాలని పై నుంచి వచ్చిన ఆదేశాలతో మండల స్థాయిలో అధికారులు తల పట్టుకుంటున్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. కానీ సంపన్నులకు ఆ బాధ్యతను అప్పగించడమంటే ప్రభుత్వం పేదల సంక్షేమం నుంచి వైదొలగడమేనని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. ప్రభుత్వ పథకాల నుంచి పేదలు లబ్ధి పొందితే ఎవరికీ జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉండదు. పీ–4లో సంపన్నుల నుంచి సాయం అందితే పేదలను వారి చెప్పుచేతల్లో పెట్టడమేనని అభిప్రాయపడుతున్నారు. పీ–4 కోసం సంపన్నుల గుర్తింపు పెద్ద ప్రహసనంగా తయారై మండల స్థాయిలో అధికారులకు తలకు మించిన భారంగా తయారైంది.

బంగారు కుటుంబాలివీ..

కాకినాడ జిల్లాలో బంగారు కుటుంబాలు 1,02,450. ఇందులో ఆగస్టు 15 నాటికి నిర్దేశించిన లక్ష్యం 80,158 కుటుంబాలు. ఇప్పటికే దత్తత తీసుకున్న కుటుంబాలు 3,844. ఇంకా దత్తత తీసుకోవాల్సిన కుటుంబాలు 76,314. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎంపిక చేసిన కుటుంబాలు 64 వేలు ఉండగా వడపోతల అనంతరం 35 వేలకు చేరుకోవచ్చునని అంచనా వేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 57 వేల బంగారు కుటుంబాలను ప్రాథమిక సర్వేలో గుర్తించారు. ఇందులో 1226 మార్గదర్శకులకు 12,500 బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేశారు. ఇదే విషయాన్ని ఆ జిల్లా కలెక్టర్ ప్రశాంతి శుక్రవారం రాత్రి సీఎం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో నివేదించారు. కలెక్టర్ మలకపల్లి గ్రామానికి చెందిన సనమంద్ర పోసిబాబు కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్టు వీసీలో వివరించారు. వీరందరికీ మార్గదర్శకులను అన్వేషించాల్సిన భారం ఇప్పుడు అధికారులపై పడింది.

మార్గదర్శుల సహకారంతో పీ–4



జీరో పేదరికమే ధ్యేయంగా మార్గదర్శకుల సహకారంతో ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు పీ–4 దోహదపడుతుంది. ఉన్నత ఆశయంతో చేపట్టిన ఈ పథకం విజయవంతానికి సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, ప్రవాసభారతీయులు ముందుకు రావాలి. అందరి సహకారంతో తక్కువ సమయంలో బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అంతా సమిష్టిగా కృషిచేసి సమాజంలో ఆర్థిక సాధికారతలో భాగస్వామ్యులు కావాలి. బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చేందుకు గ్రామ సభల ద్వారా మార్గ దర్శకులను ఎంపిక చేయాలి. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ఈ కార్యక్రమం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది.

– షణ్మోహన్, జిల్లా కలెక్టర్, కాకినాడ

కుటుంబాల కుదింపు సరికాదు



పీ–4తో మొదట్లో పెద్ద సంఖ్యలో పేదలను ఎంపిక చేశారు. ఇప్పుడేమో సవాలక్ష నిబంధనలు పెట్టి కుటుంబాల సంఖ్యను తగ్గించేయాలనుకుంటున్నారు. ఈ రకమైన విధానంతో ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందో స్పష్టత ఇవ్వాలి. పూర్వం సంపన్నవర్గాలు సాయం, అప్పు రూపంలో డబ్బులిచ్చి అందుకు తగ్గట్టు పనిచేయించుకునే వారు. ఆ పరిస్థితి చంద్రబాబు సర్కార్ తీసుకువస్తున్న పీ–4లో కనిపిస్తోంది. పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకు నేరుగా అవసరమైన సాయం అందించాలి.

– కర్నాకుల వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రైతుకూలీ సంఘం, జగ్గంపేట

సత్యదేవుని జయంత్యుత్సవాలకు శ్రీకారం

రుత్విక్కులకు దీక్షావస్త్రాలు అందజేసిన చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు

అన్నవరం: రత్నగిరీశుని 135వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యావహచనం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి జయంత్యుత్సవాలకు అంకురార్పణ చేశారు. ప్రధాన ఆలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పట్టువస్త్రాలతో, స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జప, తపాలు చేసే 40 మంది రుత్విక్కులకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దీక్షా వస్త్రాలను అందచేశారు. రుత్విక్కుల వేద మంత్రాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సూర్య నమస్కారాలు, లింగాష్టకం, నవావరణ అర్చన, రామాయణ, భాగవత పారాయణ, శ్రీ, పురుష సూక్త పారాయణ, బాలా, కొమారీ, సువాసినీ పూజలు నిర్వహించారు. సాయంత్రం దర్బారు మండపంలో మండపారాధన, కలశస్థాపన ఆయుష్యహోమానికి అంకురార్పణ చేశారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

సత్యదేవుడు, అమ్మవారిని సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు గరుడ వాహనంపై కొండ దిగువన ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంగణాలను విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఆస్థాన వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, శివ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

నేడు స్వామివారి జయంత్యుత్సవం

సత్యదేవుని జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరులకు అలంకరణ, 11 గంటలకు అనివేటి మండపంలో ఆయుష్యహోమం పూర్ణాహుతి నిర్వహించనున్నారు.

చంద్రబాబు, లోకేష్‌లపై కేసులు పెట్టాలి

- ప్రజలను మోసగించడంలో దొందూ దొందే
- ప్రజా సంక్షేమం కోసం జగన్ పని చేశారు
- కరోనా సమయంలో ఆర్థికంగా ఆదుకున్నారు
- మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

తుని: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కాలర్ పట్టుకుని నిలదీయాలని చెప్పిన మంత్రి నారా లోకేశ్, మోసగించిన చంద్రబాబులపై ప్రజలు పోలీస్ కేసులు పెట్టాలని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ప్రజలను కోరారు. శుక్రవారం తుని మర్చంట్ అసోసియేషన్ భవనంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై పట్టణ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి రేలంగి రమణగౌడ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దాడిశెట్టి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి ఎన్నికలకు వెళ్లారని, ఇది చూసి ఆందోళన చెందిన చంద్రబాబు సూపర్ సిక్స్ పేరిట సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది పూర్తవుతున్నా రెండు పథకాలు మాత్రమే అమలు చేశారని, మిగిలిన వాటి జోలికి వెళ్లడంలేదన్నారు. ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మరో మంత్రి అచ్చెన్నాయుడు అనడాన్ని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం పథకంలో 30 లక్షల మందికి మొండి చేయి చూపించారని విమర్శించారు. ఇదే చంద్రబాబు వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాలు ఇస్తుంటే రాష్ట్రం శ్రీలంక, సోమాలియాలా అయిపోతుందని గగ్గోలు పెట్టారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో 13 శాతం గ్రోత్ రేటు ఉంటే ఈ ప్రభుత్వంలో 3 శాతం ఉందని, అంటే 10 శాతం వృద్ధి రేటు తగ్గిందన్నారు. ప్రజలు 2014–19, 2019–24 మధ్య కాలంలో ఎవరి పాలనలో ప్రజలకు మేలు జరిగిందో విశ్లేషించుకోవాలన్నారు. మద్యం కేసుకు సంబంధించి గత ప్రభుత్వం 3.28 కోట్ల పత్రాలను ధ్వంసం చేసిందని చెబుతున్నారని, ఇది ఎలా సాధ్యమో ప్రజలు తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు, ఎల్లో మీడియాలో వస్తున్న కథనాలను నమ్మవద్దన్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు అందించారని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో నిరంతరం కృషి చేశారని, ఇదే చంద్రబాబు అయితే రూ.కోట్లలో నిధులు పక్కదారి పట్టి ఉండేవన్నారు. తుని పట్టణ బాధ్యతను తానే తీసుకుంటున్నానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు మాట్లాడుతూ అందరికీ పథకాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబితే తునిలో ఉన్న సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాత్రం టీడీపీ కార్యకర్తలకే ఇస్తామని చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర క్రిస్టియన్ విభాగం రాష్ట్ర కార్యదర్శి నక్కా జాన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

భారీ ప్యాకేజీలే లక్ష్యం!

- ఏఐ, డేటాసైన్స్‌లే అందరి ఆప్షన్
- సంప్రదాయ కోర్సులు కాదని సీఎస్ఈ వైపే విద్యార్థుల మొగ్గు
- ఉమ్మడి జిల్లాలో 5,600 సీట్లు అవే
- నేటితో తొలి దశ షెడ్యూల్ ముగింపు
- రేపటి నుంచి రెండో దశ షెడ్యూల్



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ కళాశాలల్లో మొదటి దశ ప్రవేశాలకు కన్వీనర్ కోటా ద్వారా సీట్లు సాధించిన విద్యార్థుల చేరికకు శనివారం సాయంత్రంతో తుది గడువు ముగియనుంది. దీంతో మరో వారం రోజుల్లో విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇంజినీరింగ్‌లో దాదాపు 40 వరకూ వివిధ కోర్సులకు బ్రాంచ్‌లు ఉన్నప్పటికీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ విద్యార్థులు మూడో ఏడాదిలోనే భారీ వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా జాబ్ మార్కెట్ ట్రెండ్‌కు అనువుగా కంప్యూటర్ సైన్స్‌లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), ఇంటర్‌నెట్ ఆఫ్‌థింగ్స్(ఐఓటీ) బ్లాక్ చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్, డైటా సైన్స్ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటికి దేశ విదేశాల్లో అపార ఉద్యోగ అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఈ కోర్సులకు ఆసక్తి చూపుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటు రాకపోయినా ప్రతి కళాశాలకు బ్రాంచ్‌కు 12 సీట్లు చొప్పున మేనేజ్‌మెంట్ కోటా ఉండటంతో ఈ కోటాలో చేరడానికి ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. కాకినాడ జిల్లా పరిధిలో పేరొందిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ బ్రాంచ్‌కు రూ.3 నుంచి రూ.4 లక్షలు డొనేషన్ చెబుతున్నారంటే ఏ స్థాయిలో డిమాండ్ ఉందో తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న కళాశాలల్లో అన్ని విభాగాలు కలిపి 16,700 సీట్లు ఉండగా వీటిలో 5,600 వరకూ సీఎస్ఈ విభాగానికి చెందినవే. వీటిలో 90 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఉన్న బ్రాంచ్‌లలో సీట్లు తగ్గించి సీఎస్ఈ సంబంధిత కోర్సులకు అధిక సీట్లు కేటాయించాలని ఉమ్మడి జిల్లాలోని ఏడు కళాశాలలు జేఎన్‌టీయూకేకు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు అంతగా ఆసక్తి చూపని మెకానికల్, సివిల్, కెమికల్, ఆటో మొబైల్, ఈఈఈ, మైనింగ్ వంటి విభాగాలలో కోర్సులను ఆయా కళాశాలలు వదిలించుకుంటున్నాయి.

ప్రారంభ ప్యాకేజీ రూ.4 లక్షలు

సీఎస్ఈ విభాగంలో బీటెక్ పూర్తిచేసిన వారికి ప్రారంభ ప్యాకేజీ రూ.4 కావడం, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్, మెక్రోసాఫ్ట్, టెక్ మహీంద్ర, ఐబీఎం వంటి కంపెనీలు ఆ కోర్సులు చేసిన విద్యార్థుల కోసం క్యూ కట్టడంతో డిమాండ్ పెరిగిపోయింది. గత ఏడాది సీఎస్ఈ విద్యార్థులు ఇద్దరికి రూ.36 లక్షలు, సీఎస్ఈ ఎంటెక్ విద్యార్థికి గూగుల్ సంస్థలో సెక్యూరిటీ అనలిస్ట్‌గా రూ.67 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం రావడం జేఎన్‌టీయూకే చరిత్రలో మైలు రాయిగా నిలిచింది. జేఎన్‌టీయూకేతో పాటు అనుబంధ కళాశాలల్లో సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థులు 95 శాతం నాలుగో ఏడాదిలో ఉండగానే ఉద్యోగాలు రావడం వంటివి మరింత ఉత్సాహాన్నిస్తున్నాయి.

సంప్రదాయ సీట్లకు తగ్గిన ఆదరణ

ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, ఐటీ, సివిల్ వంటి బ్రాంచ్‌ల సీట్లు జేఎన్‌టీయూకే వంటి కళాశాలలలో తప్ప వాటి అనుబంధ ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు.బ్రాంచ్‌కు 60 సీట్లు చొప్పున ఉంటే 30 నుంచి 35 వరకూ మాత్రమే భర్తీ అవుతున్నాయని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఏ కోర్సు చేసినా సాఫ్ట్‌వేర్ రంగమే

బీటెక్‌లో ఏ కోర్సు అభ్యసించిన నాలుగో ఏడాది సాఫ్ట్‌వేర్ రంగ సంస్థలు చేపట్టే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాల్గొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఉదాహరణకు కాకినాడ పరిధిలో పేరొందిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, మెకానికల్ విద్యార్థులు నాలుగో ఏడాదిలో ఉండగా 20 లక్షల ప్యాకేజీతో ఇటీవల ఉద్యోగాలు సాధించారు. ప్రైవేట్ కళాశాలలో అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు సీఆర్‌టీ (క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెనింగ్) తరగతులు నిర్వహించి క్యాంపస్ ఇంటర్వ్యూలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇస్తున్నారు. జేఎన్‌టీయూకే అన్ని బ్రాంచ్‌లు కలిపి 300 సీట్లు ఉండగా 90 శాతం మంది ప్రముఖ టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. దీన్నిబట్టి ఏ బ్రాంచ్ తీసుకున్నా ఆఖరి సంవత్సరంలో ఒకే రంగంలోకి వస్తున్నారన్నది అర్థమౌతోంది. జేఎన్‌టీయూకే ఈసీఈ విద్యార్థి బొడపాటి నివాస్ రూ.35 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాడు.

రేపటి నుంచి రెండవ దశ కౌన్సెలింగ్

మొదటి దశలో సీటు పొందిన విద్యార్థులు శనివారం సాయంత్రంలోగా కళాశాలలో రిపోర్టు చేయాలి. లేకుంటే సీటు రద్దవుతుంది. రెండో దశ కౌన్సెలింగ్‌కు సంబంధించి 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్‌కు షెడ్యూల్ విడుదల చేశారు.

షెడ్యూల్ ఇదే..

27వ తేదీ నుంచి 30 వరకూ రిజిస్ట్రేషన్.
28 నుండి 30 వరకూ సర్టిఫికెట్లు అప్‌లోడ్.
28 నుండి 31 వరకూ వెబ్ ఆప్షన్లు.
ఆగస్టు 1న వెబ్ ఆప్షన్లు మార్పు.
ఆగస్టు 4న సీట్లు కేటాయింపు.
ఆగస్టు 8న రిపోర్టింగ్‌కు తుది గడువు.

సీఎస్ఈ వైపు మొగ్గుతున్నారు



ఇంజినీరింగ్ అంటే సాఫ్ట్‌వేర్ అనే విధంగా ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. బీటెక్‌లో సంప్రదాయ కోర్సులు ఉన్న నేటి కాలంలో సాంకేతికతకు అనుగుణంగా కొత్త కోర్సులు రావడంతో విద్యార్థులు వాటివైపే మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటిలెజెన్స్, డేటాసైన్స్ వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీ, కోడింగ్ ప్లాట్‌ఫామ్స్, సాఫ్ట్‌స్కిల్స్‌పై అవగాహన ఉంటే ఉపాధి త్వరగా పొందవచ్చు.

– ఎస్.రామకృష్ణయ్య, సీఎస్ఈ ప్రొఫెసర్, జేఎన్‌టీయూకే

క్లుప్తంగా

కోలుకుంటున్న ముద్రగడ

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడిందని, ఆయన మెల్లగా కోలుకుంటున్నారని ముద్రగడ వీర్రాఘవరావు (బాలు) తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్న పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దగ్గర ఉండి తన తండ్రి ఆరోగ్యాన్ని చూసుకుంటున్నారని, ప్రజలు అధైర్య పడొద్దన్నారు. ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని దేవాలయాల్లో పూజలు చేస్తున్న ప్రతి ఒక్కరికీ తమ కుటుంబం రుణపడి ఉంటుందన్నారు.

28న నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్‌కే నికట్ – డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం ఎంఆర్ పాలెంలోని ఆంధ్రా పేపర్ మిల్లు, కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్ రోడ్డులోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సీవీ రామన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలోని 3 ఎఫ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పశ్చిమ గోదావరి జిల్లా కాళ్లలోని లార్డ్ సైజ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (ఎల్ఎస్‌సీఎస్), అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని కొత్తాడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పీఎఫ్‌కు సంబంధించిన సమస్యలను సభ్యులు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం ముషిణీవారిపాలెం వెళ్లే రహదారి వద్ద మలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాలేనికి చెందిన పిల్లి మోహన్, మట్టపర్తి హర్షవర్ధన్ మోటారు బైక్‌పై అంబాజీపేట వస్తున్నారు. ఆ సమయంలో అంబాజీపేట నుంచి జి.అగ్రహారం వెళుతున్న కారు, ఆ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోహన్ తీవ్రంగా, హర్షవర్ధన్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. కాగా.. ప్రసాద్ నగర్ కాలనీ నుంచి పెదపాలెం వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

పుస్తకాల సరఫరాకు కొటేషన్ల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థానానికి వివిధ రకాల పుస్తకాలను సరఫరా చేయడానికి సరఫరాదారుల నుంచి సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన సరఫరాదారులు 32 పుస్తకాలలో ఒక్కొక్క దానిపై ఇచ్చే డిస్కౌంట్ వివరాలను సమర్పించాలన్నారు. కొటేషన్లను ఆగస్టు 5 సాయంత్రం ఐదు గంటల లోపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం చిరునామాకు పంపాలన్నారు.

శిశువులకు అమృతమే..

- తల్లిపాలలో పోషకాలు
- బిడ్డలకు తాగిస్తే ఎన్నో ప్రయోజనాలు
- తల్లులకూ ఉపయోగమే
- వచ్చే నెల ఒకటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది (ఫైల్)

రాయవరం: శిశువుకు అత్యంత బలం, రోగనిరోధక శక్తిని అందించేవి తల్లిపాలే. అవి దాదాపు అమృతంతో సమానం. అందుకే పిల్లలు పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించాలని వైద్యులు చెబుతారు. తల్లి పాలు తాగిన పిల్లలకు రోగనిరోధకశక్తి పెరుగుతుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఎదుగుదల చాలా చక్కగా ఉంటుంది. అయితే పిల్లలకు తల్లి పాలు ఎప్పటి వరకూ పట్టించాలి, ముర్రుపాలు అంటే ఏమిటి అనే విషయాలపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరం. దీని కోసం ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తారు.

తల్లిపాల గొప్పదనం

తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివి. బిడ్డ పుట్టిన వెంటనే అర్ధగంటలోపు ముర్రుపాలు పట్టాలి. ఎందుకంటే ఆ పాలలో బిడ్డను వ్యాధుల నుంచి రక్షించే ఖనిజాలు, మాంసకృతులు, విటమిన్–ఏ సమృద్ధిగా ఉంటాయి. ముర్రు పాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుంది. తల్లిపాలు శిశువులకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమమైన పౌష్టికాహారం అని చెప్పవచ్చు. వీటి వల్ల పిల్లలకు మల విసర్జన సులభంగా అవుతుంది. తల్లితో చక్కటి అనుబంధం ఏర్పడుతుంది. బిడ్డ కోరుకున్న ప్రతిసారి ఎంతసేపు తాగితే అంతసేపు తల్లి పాలు పట్టించాలి.

ఆరోగ్యకర సమాజం

సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో తల్లుల వైఖరిలో కూడా మార్పు వస్తోంది. బిడ్డకు పాలిస్తే తమ అందం పాడవుతుందని ఆలోచించే తల్లులు కూడా నేటి సమాజంలో దర్శనమిస్తున్నారు. తల్లి పాలు పట్టడం వలన బిడ్డలు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో వరల్డ్ అలైన్స్ ఫర్ బెస్ట్ ఫీడింగ్ ఏక్షన్(వాబా) అనే సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యూహెచ్‌వో, యునిసెఫ్ వంటి అంతర్జాతీయ, బీపీఎన్ఐ వంటి జాతీయ సంస్థల అనుబంధంగా ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. తల్లిపాలను ముఖ్యంగా బిడ్డ పుట్టిన గంట లోపే ముర్రుపాలు ఎందుకు పట్టించాలనే అంశంపై ఏటా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాలు జరుపుతున్నాయి.

తల్లికీ ప్రయోజనాలు

బిడ్డకు తల్లి పాలివ్వడం వల్ల ఆరు నెలల్లోపు గర్భం దాల్చే అవకాశం ఉండదు. ఇది సహజ కుటుంబ నియంత్రణ పద్ధతిగా ఉపయోగపడుతుంది. పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భసంచి, అండాశయం క్యాన్సర్లు వచ్చే అవకాశం తక్కువని కొన్ని రకాల అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వస్థితికి వచ్చి రక్తస్రావం తగ్గుతుంది. తల్లిపాల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అవి పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తినాలి.

వైద్యారోగ్యశాఖ రక్షణ అవసరం

బాలింతలకు వైద్యఆరోగ్యశాఖ రక్షణ అవసరం. వారికి అవసరమైన మందులు అందించాలి. ముఖ్యంగా రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలి. అవసరమైన సమయంలో గర్భిణుల రక్తశాతాన్ని పరిశీలించాలి. ప్రసవం తర్వాత కాల్షియం, ఐరన్ మాత్రలను ఆరు నెలల పాటు అందించాలి.

జిల్లాలో పరిస్థితి

అంగన్‌వాడీ కేంద్రాలు	1,726
బాలింతలు	5,846
గర్భిణులు	7,725
ఆరు నెలల లోపు చిన్నారులు	901
6 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు	7,017
3–6 ఏళ్ల వయస్సున్న చిన్నారులు	8,041

అధిక పోషకాలు



పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలు మాత్రమే పట్టించాలి. తల్లి పాలలోనే పోషకాలు ఉంటాయి. ఆకలితో ఉన్న బిడ్డకు డబ్బా పాలు ఇవ్వడం వల్ల శక్తిని కోల్పోతారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే అందించాలి. డబ్బా పాల ద్వారా పౌష్టికాహారం అందదు.

– డాక్టర్ రమ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

వ్యాధులు దూరం



దేవుడు సృష్టించిన తల్లి పాలు ఒక టీకా కంటే గొప్పవి. తల్లి పాలు పట్టించడం వల్ల బిడ్డకు వైరల్ ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. తల్లి పాలలో ఎన్నో పోషకాలు, ప్రొటీన్లు ఉంటాయి. బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు, శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తాయి.

– డాక్టర్ పి.ప్రశాంతి, గైనకాలజిస్ట్, మండపేట సీహెచ్‌సీ

పరామర్శకు వెళుతూ మృత్యుఒడికి..

- ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు
- తల్లీ కుమార్తెలు, ఆటోడ్రైవర్ మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- పటవల వద్ద ప్రమాదం



ఆటో డ్రైవర్ రాజు (ఫైల్)



పోతాబత్తుల దుర్గ (ఫైల్)



లంకే భవాని (ఫైల్)



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

తాళ్లరేవు: ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జాతీయ రహదారి 216లో పటవల జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగ గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు పోతాబత్తుల దుర్గ, లంకే భవానితో పాటు దుర్గ చెల్లెలు ఓలేటి లక్ష్మి శుక్రవారం గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి సంగాడి గంగరాజును పరామర్శించేందుకు ఆటోలో బయలుదేరారు. గంగరాజు ఇటీవల కంటికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. జాతీయ రహదారి 216లో పటవల జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోకి వచ్చే సరికి వీరి ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ఘటనలో పోతాబత్తుల దుర్గ (55), లంకే భవాని (35)తో పాటు యానాం కురసాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కూరాకుల కుమార్ రాజు (30) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఓలేటి లక్ష్మిని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ సందర్శించారు. ప్రమాదానికి కారణమైన బస్సును సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురి మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కాగా.. విజయవాడ సమీపంలో నందిగామ వద్దనున్న కేతవరం గ్రామంలో నివసిస్తున్న దుర్గ తన కుమార్తె భవాని కుమారులు శ్రీనివాస్, దేవేంద్రల చదువు నిమిత్తం కాకినాడకు వచ్చి ఉంటోంది. అలాగే కురసంపేట వీటీసీకి చెందిన రాజు ఆటో నడుపుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. వీరి మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

అన్నవరంలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలో జరిగిన నకిలీ పీఎఫ్ చలానాల ఘటనకు సంబంధించి ప్రకంపనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, గుమస్తా ఎం.రామకృష్ణలను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు శుక్రవారం ఆదేశాలిచ్చారు. గతంలో ఆ విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేసి ప్రస్తుతం డిప్యూటేషన్ మీద సింహాచలం దేవస్థానంలో పనిచేస్తున్న బలువు సత్య శ్రీనివాస్‌కు కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇప్పటికే విజయవాడకు చెందిన కనకదుర్గ మ్యాన్ పవర్ సర్వీసెస్ శానిటరీ కాంట్రాక్టర్‌పై దేవస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రిమినల్ కేసు నమోదు చేశారు. కాగా.. దేవస్థానంలో శానిటరీ వర్క్ నిర్వహిస్తున్న కనకదుర్గ మ్యాన్ పవర్ సర్వీసెస్‌కు నెలకు రూ.59 లక్షలు చెల్లించేలా గతంలో కాంట్రాక్టు అప్పగించారు. దీనిలో భాగంగా ఆ సంస్థ కాంట్రాక్టర్ మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి 350 మంది పారిశుధ్య సిబ్బందికి రూ.30 లక్షలు పీఎఫ్ కట్టినట్టు నకిలీ రశీదులు సృష్టించాడు. వాటిని దేవస్థానం అధికారులకు అందజేసి, రూ.1.77 కోట్ల బిల్లు చేయించుకున్నాడు. ఈ స్కామ్‌ను సాక్షి పత్రిక వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

28 నుంచి ఎంపీడీఓలకు శిక్షణ



కేఎస్‌వీ ప్రసాదరావు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 28 నుంచి ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన 89 మందికి శిక్షణ ఇస్తున్నట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే మొదటి బ్యాచ్‌లో 46 మంది ఎంపీడీఓలు హాజరవుతారన్నారు. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తయిన తర్వాత రెండో బ్యాచ్ శిక్షణ ఉంటుందన్నారు.

ఆర్టీసీ తీర్థయాత్ర బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 29, ఆగస్టు 3న శ్రావణ మాసం స్పెషల్ తీర్థయాత్ర బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రత్యేక బస్సులు తెల్లవారుజామున 5 గంటలకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి 8 పుణ్యక్షేత్రాలను దర్శించి, తిరిగి రాత్రి 9 గంటలకు డిపోకు చేరుకుంటాయన్నారు. కోట సత్తెమ్మ (నిడదవోలు), పెద్దింట్లమ్మ (కొల్లేటి కోట), మావుళ్లమ్మ (భీమవరం), పార్వతీ సమేత సత్తేశ్వరస్వామి (యనమదుదురు), శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి (కాళ్లకూరు), బాలాత్రిపుర సుందరి రామలింగేశ్వరస్వామి (ఆచంట), రామేశ్వరస్వామి (త్రిలింగ క్షేత్రం)(నత్తా రామేశ్వరం), వాసవీ కన్యకా పరమేశ్వరి (పెనుగొండ) ఆలయాలను దర్శించుకోవచ్చన్నారు. మనిషికి రూ.500 టిక్కెట్ ధర నిర్ణయించామని, కావాల్సినవారు 95023 00189, 73829 12141 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

- సచివాలయ ఉద్యోగులతో వెట్టిచాకిరీ
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బాపూజీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాపూజీ

ముమ్మిడివరం: ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన జిల్లా ఉద్యోగుల సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామసూర్యనారాయణ నాయకత్వంలో రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఉద్యోగులను ఐక్యం చేసి ముందుకు సాగుతామన్నారు. జిల్లాలో అర్బన్, రూరల్ ప్రాంతాలలో సచివాలయ ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని బాపూజీ వాపోయారు. సెలవు దినాలలో కూడా ఉద్యోగులతో పని చేయించుకోవడం అన్యాయమన్నారు. ఫీల్డ్ వర్కు పేరుతో నిర్బంధించి పని చేయించడం ఉద్యోగుల హక్కులను కాలరాయడమేనన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరిగే ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి పిలుపు ఇస్తామన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.వీరబాబు, జిల్లా కోశాధికారి ఎస్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముమ్మిడివరం తాలూకా కమిటీ నియామకం జరిగింది. తాలూకా అధ్యక్షుడిగా జీఎస్‌వీడీ ప్రసాద్, కార్యదర్శిగా రెడ్డి సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.నూకరత్నం, ఉపాధ్యక్షులుగా డాక్టర్ పూజ, టి.సుజాత, డి.సువర్ణరాజు, ఎం.స్టీవెన్, కోశాధికారి డి.మహేష్, సహాయ కార్యదర్శులుగా ఎం.రమేష్, సీహెచ్ లలిత నియమితులయ్యారు.

126 ఏళ్ల వృక్షానికి పునరుజ్జీవం



ఎస్పీ కార్యాలయ ఆవరణలో చెట్టును నాటిన ఐకాన్స్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని సుమారు 126 ఏళ్ల వయసున్న వృక్షానికి పునరుజ్జీవం వచ్చింది. స్థానిక టౌన్ హాలు రోడ్డులోని మెరక వీధిలో కొద్ది రోజుల క్రితం ఆ చెట్టు కూలిపోయింది. దీంతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ స్పందించింది. ఆ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా ఆధ్వర్యంలో ఆ చెట్టును శుక్రవారం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయ ఆవరణలో నాటారు. ఐకాన్స్ ప్రెసిడెంట్ మండవల్లి వెంకన్న బాబు, ప్రోగ్రాం చైర్మన్ రైతుబిడ్డ దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ డి.నవీన్ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వెయ్యి మందికి విజయవంతంగా ఐవీఎఫ్



సక్సెస్ మీట్‌లో పాల్గొన్న డాక్టర్ కిన్నెర వీణ, వైద్య బృందం

కాకినాడ క్రైం: కాకినాడ మెడ్‌వే సంజీవి ఐవీఎఫ్ సెంటర్‌లో వెయ్యి మందికి మహిళలకు ఐవీఎఫ్‌లు నిర్వహించి, తల్లి కావాలన్న వారి కలను సాకారం చేశామని ఐవీఎఫ్ నిపుణురాలు, గైనకాలజిస్టు డాక్టర్ ఎస్.కిన్నెర వీణ అన్నారు. ఆ సెంటర్‌లో శుక్రవారం వరల్డ్ ఐవీఎఫ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో డాక్టర్ కిన్నెర మాట్లాడుతూ సమగ్ర సంరక్షణ ద్వారా తల్లిదండ్రుల కల నెరవేర్చడమే తమ లక్ష్యమన్నారు. సెంటర్ హెడ్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఐవీఎఫ్ చికిత్స అందిస్తున్నామన్నారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ ఐవీఎఫ్ కేవలం ఓ వైద్య ప్రక్రియ కాదని, వైవాహిక జీవితాన్ని సంపూర్ణం చేసే ఓ అద్భుతమన్నారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఐవీఎఫ్ కేసుపై వ్యక్తిగత పర్యవేక్షణ కొనసాగిస్తూ తల్లిదండ్రుల కలలు సాకారం చేస్తున్నామని తెలిపారు. కాగా.. ఐవీఎఫ్ ద్వారా విజయవంతంగా పిల్లల్ని పొందిన తల్లిదండ్రులు తమ అనుభవాల్ని పంచుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ అధికారి లావణ్య తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్యకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కొంతమూరు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై గల నయరా పెట్రోల్ బంక్ సమీపంలో ఎక్సైజ్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారులో 220 కేజీల గంజాయిని తరలిస్తున్న తమిళనాడుకు చెందిన నాగరాజు, సుబ్రహ్మణ్యం, జైసల్వాలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో ఎస్సై సీహెచ్ రాజేష్, ఎం.శ్రీనివాసరావు, ఏ.రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను రక్షించిన పోలీసులు



గోదావరిలో దూకబోయిన మహిళను కాపాడిన కొవ్వూరు పోలీసులు

తాళ్లపూడి (కొవ్వూరు): స్థానిక రోడ్ కం రైల్వే వంతెన పైనుంచి గోదావరిలో దూకబోయిన మహిళను పట్టణ పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళితే. కొయ్యలగూడెం మండలానికి చెందిన సుమారు 30 ఏళ్ల మహిళ తన కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో శుక్రవారం కొవ్వూరులోని రోడ్ కం రైల్వే వంతెన పైకి వచ్చింది. అటుగా ఆటోలో వెళ్తున్న శ్రీనివాస్ అను వ్యక్తి ఆ మహిళను గమనించి, 112 ద్వారా జిల్లా పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం వెంటనే కొవ్వూరు టౌన్ సిబ్బంది ఎంవీవీ సత్యనారాయణను స్థలానికి పంపారు. దీంతో ఆ మహిళను గుర్తించి, ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుని, పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత ఆమె బంధువులకు అప్పగించారు.

రెండు దుకాణాల్లో చోరీ

రాజానగరం: దివాన్‌చెరువు శివారు ఆటో నగర్‌లోని రెండు షాపులలో చోరీ జరిగింది. పాలచర్లకు చెందిన ద్వారంపూడి క్రినా మోహన్‌రెడ్డి ఆటోనగర్‌లోని తన ఆటోమెకానిక్ ఇంజినీరింగ్ షాపునకు గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో షాపు తెరిచేందుకు వచ్చేసరికీ, తాళం పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూస్తే ఒక ల్యాప్ టాప్, ఒక సెల్ ఫోన్‌తో పాటు రూ. 20 వేలు అపహరణకు గురైనట్టు గుర్తించాడు. అలాగే ఈ షాపునకు కొద్ది దూరంలో ఉన్న వేరొక షాపులో కూడా దుండగులు ప్రవేశించి రెండు ల్యాప్‌టాప్‌లు పట్టుకుపోయారు. ఈ మేరకు బాధితులు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణమ్మ తెలిపారు.